సాక్షి
అనకాపల్లి

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



వినూత్నం.. విభిన్నం

విద్యార్థులను స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే సెల్ఫ్ ప్రోగ్రాం మన్ననలు పొందుతోంది. 8లో



హీరో శ్రీకాంత్ సందడి

ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ అడ్డురోడ్డు సమీపంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి విచ్చేసి సందడి చేశారు. 8లో



పనస...నోరూరేలా..

దేవరాపల్లి : మండల పరిషత్ కార్యాలయం లోని పనస చెట్టు విరగ్గాసింది. గుత్తు గుత్తులుగా కాయలు కాసి చూపరులకు నోరూరిస్తోంది.

న్యూస్‌రీల్

స్నేక్ సేవర్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: వన్య ప్రాణులతోపాటు మన చుట్టూ సంచరిస్తున్న జంతువులను సంరక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్నేక్ సేవర్ సొసైటీ ఆధ్వర్యంలో స్నేక్ సేవర్ వెబ్‌సైట్‌ను మిందిలోని తన నివాసంలో మంత్రి ప్రారంభించారు. విష సర్పాల వల్ల ప్రజలకు ఎటువంటి హాని లేకుండా వాటిని సంరక్షిస్తుండంలో సొసైటీ అధ్యక్షుడు రొక్కం కిరణ్‌కుమార్ చూపుతున్న కృషి అభినందనీయమన్నారు.

వెంకన్న కల్యాణానికి రండి

● ఎంపీ సత్యవతికి దేవస్థానం ఆహ్వానం



ఎంపీకి ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న దేవస్థానం అధికారులు

నక్కపల్లి : వచ్చే నెల 3వ తేదీన ప్రాచీన పుణ్య క్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే స్వామివారి వార్షిక కల్యాణానికి రావాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతిని దేవస్థానం వారు ఆహ్వానించారు. ఆదివారం ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వామి శేషాచార్యులు, తరిగొండ వెంగమాంబ సాహితీ పీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి ఎంపీని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధ ఏకాదశినాడు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. వచ్చే నెల 3వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందని అంతకు ముందు స్వామివారి కన్యావరుణ సంవాదం, రథోత్సవం జరుగుతాయన్నారు, వీటిని తిలకించేందుకు రావాల్సిందిగా వారు ఎంపీని ఆహ్వానించారు.

జనుము పూల సోయగం



ఎల్.బి.పురంలో విస్తారంగా సాగవుతున్న జనుము పంట

బుచ్చెయ్యపేట : మండలంలోని ఎల్.బి. పురం, వడ్డాది, పేట, బంగారుమెట్ట, పీడీ పాలెం, రాజాం, సీతయ్యపేట, గున్నెంపూడి, తురకలపూడి, రాజాం తదితర గ్రామాల్లో ఈ ఏడాది 1,200 ఎకరాల్లో జనుము పంట సాగవుతోంది. ప్రస్తుతం పంట పూత, పిందె దశకు చేరింది. పసుపురంగు పూలతో ప్రకృతి ప్రియుల్ని ఆకట్టుకుంటోంది. మూడు నెలల కాలంలో తక్కువ పెట్టుబడితో పండే పంట రైతులకు లాభాలు చేకూరుస్తుంది. మరో ఇరవై రోజుల్లో గింజ పట్టి పంట చేతికొస్తుంది. కేజీ రూ.60 వరకు ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. పూత బాగుండడంతో ఎకరాకు 200 కేజీలకు పైగా దిగుబడి వచ్చి లాభాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జ్యోత్స్నకు రజతం



రజిత పతకం సాధించిన జ్యోత్స్న

తుమ్మపాల : ఈ నెల 23 నుంచి 27 వరకు జమ్ముకాశ్మీర్‌లో జరుగుతున్న ఫెడరేషన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 52 కేజీల బాలికల అనకాపల్లికి చెందిన ఎ.జోత్స్న రజత పతకాన్ని సాధించినట్టు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. ఈ పోటీలలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆమె స్క్వాట్–120, బెంచి ప్రెస్ 65, డేడెలిఫ్ట్ 135, మొత్తం 320 కేజీల బరువులు ఎత్తి విజయం సాధించిందన్నారు. ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేసి ఆమెతో పాటు కోచ్ గుండ్రపు నీలాకు అసోసియేషన్ తరపున అభినందనలు తెలిపారు.

అడుసు తొక్కనేల...

విద్యార్థి దశలో సన్మార్గంలో నడిస్తే.. అది మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. అదే దశలో తప్పటడుగులు పడితే అది జీవితాన్ని చిందరవందరగా మారుస్తుంది. ఒక విద్యార్థి చెడు మార్గంలోకి వెళ్లాలన్నా...మంచి మార్గంలో నడవాలన్నా...తల్లిదండ్రులతో పాటు కళాశాల అధ్యాపకులు, స్నేహితుల మీద ఆధారపడి ఉంటుంది. విద్యార్థులు పెడదారి పట్టకుండా సన్మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రులతో పాటు కళాశాల అధ్యాపకులది కీలక పాత్రగా ఉంటుంది. అందుకే వీరి ముగ్గురినీ భాగస్వాములుగా చేస్తూ విద్యార్థుల ప్రవర్తనపై పోలీసులు నిఘా పెంచారు. ఇందుకోసం కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక, సత్ప్రవర్తన కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.



- గంజాయి స్మగ్లర్ల వలలో యువతరం
- విద్యార్థులు పెడదారి పట్టకుండా పోలీసుల చర్యలు
- కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, కంప్లయింట్ బాక్సులు
- కమిటీలో ఇద్దరు లెక్చరర్లు, ఒక పోలీసు సిబ్బంది, ముగ్గురు విద్యార్థులు
- అనకాపల్లి , నర్సీపట్నం, పరవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు
- వచ్చే నెల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో అమలు

సాక్షి, అనకాపల్లి : ఇటీవల కాలంలో అక్రమ గంజాయి రవాణాలో యువతరం జోగుతున్నారు. గంజాయి సేవిస్తూ..వారితో పాటు వారి తోటి విద్యార్థుల భవిష్యత్తు నాశనానికి కూడా పరోక్షంగా కారణమవుతున్నారు. వీరిలో కొంతమంది జల్సాలకు అలవాటు పడి.. ఆకతాయిలతో స్నేహాలు



నర్సీపట్నంలో ఓ ప్రైవేట్ కళాశాలలో స్కిట్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చేసి.. వారి ఉజ్వల భవిష్యత్తును ఇంటర్, డిగ్రీ స్థాయిలోనే చిదిమేసుకుంటున్నారు. అభం..శుభం తెలియని విద్యార్థులకు డబ్బు ఆశ చూపించే గంజాయి స్మగ్లర్ల చెరలో పడి వారి జీవితాలను నాశనం చేసుకోకుండా కళాశాలల్లో సత్ప్రవర్తన కమిటీలు వేసి వారిని సన్మార్గంలో పెట్టడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో ఆయా కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లతో పాటు సీనియర్ విద్యార్థులు, ఒక పోలీస్ సిబ్బందితో కమిటీలు వేస్తున్నారు. ఈ ప్రక్రియ వచ్చే నెల మొదటి వారం నాటికి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి కానుంది.

అనుమానం కలిగితే కౌన్సెలింగ్

జిల్లాలో గల ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో ఈ కమిటీలు విద్యార్థులపై అనుమానం కలిగితే వారికి కౌన్సెలింగ్ ఇస్తారు.

ఈ కమిటీల్లో కళాశాల లెక్చరర్ గానీ, ప్రిన్సిపాల్ గానీ ఒకరు ఉంటారు. అదేవిధంగా ముగ్గురు విద్యార్థులు (ఒకరు మహిళ, ఇద్దరు పురుషులు), ఆ కళాశాల ఏ స్టేషన్ పరిధిలో ఉంటే ఆ స్టేషన్‌లో గల ఏఎస్‌ఐ లేదా కానిస్టేబుల్ ఒకరు ఉంటారు. వీరంతా నెలకు రెండు మూడు సార్లు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేరాలకు పాల్పడితే పడే శిక్షలపై కూడా విద్యార్థులకు స్కిట్‌ల రూపంలో, సదస్సుల ద్వారా ప్రచార రథాల ద్వారా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా గంజాయి, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఇతర అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే పడే శిక్షలపై వారికి అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇప్పటికే అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో కమిటీలను నియమించడం జరిగింది.

జిల్లాలో 131 కళాశాలల్లో సత్ప్రవర్తన, ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేశారు..

★ అనకాపల్లి సబ్‌డివిజన్ పరిధిలో	60
★ నర్సీపట్నం సబ్‌డివిజన్ పరిధిలో	36
★ పరవాడ సబ్‌డివిజన్ పరిధిలో...	35



ప్రచార రథం ద్వారా కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు

విద్యార్థి దశలో పారాహుషార్...



విద్యార్థి దశలో సరైన దిశలో పయనిస్తేనే ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుంది. అందుకే విద్యార్థులు చెడుమార్గంలోకి వెళ్లకుండా జిల్లాలో ఉన్న ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో 'సత్ప్రవర్తన, యాంటీ ర్యాగింగ్' కమిటీలను ఏర్పాటు చేశాం. ఒక విద్యార్థి చెడు మార్గంలో అడుగు వేస్తున్నాడంటే..అది తోటి విద్యార్థికి, వారికి పాఠాలు చెప్పే అధ్యాపకులకు కూడా ముందుగా తెలిసే అవకాశాలుంటాయి. అది గుర్తించి ప్రారంభంలోనే ఆయా విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్టయితే ఆ విద్యార్థిలో మార్పు వస్తుంది. ఈ విషయమై అవగాహన కల్పించేలా వారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ కమిటీలు ఏర్పాటు చేశాం. ప్రచార వాహనం ద్వారా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదకద్రవ్యాల వాడకం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాకుండా విద్యాసంస్థల వద్ద, ప్రధానమైన కూడళ్ల వద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మాదకద్రవ్యాల అక్రమ రవాణాని అరికట్టేందుకు పోలీస్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్(14500)కు సమాచారం తెలియజేయాలి.

– గౌతమి సాలి, జిల్లా ఎస్పీ

జీఐఎస్‌కు మిట్టల్, ముఖేష్ అంబానీ

- సదస్సుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలి
- జిల్లా స్థాయి సమీక్షలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.జి సృజన



సమీక్షలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.సృజన, విశాఖ కలెక్టర్ డా.మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : వచ్చే నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.గుమ్మళ్ల సృజన సూచించారు. జీఐఎస్–2023కు సంబంధించి ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన పనులపై విశాఖ జిల్లా కలెక్టర్ డా. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలిసి ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ జీఐఎస్‌కు నవీన్ మిట్టల్, ముఖేష్ అంబానీ, తదితర ప్రముఖ వ్యాపార వేత్తలు, అంబాసిడర్లు, పారిశ్రామిక వేత్తలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామిక వేత్తలను విమానాశ్రయంలో ఆహ్వానం పలికి.. వారికి వాహనాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ మైదానంలో ఏర్పాటు చేసిన సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లపై వేదికల వారీగా వివరించారు. ప్రారంభోత్సవంలో లేజర్‌షో, మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాటతో ప్రారంభమవుతుందని, రెండో రోజు సదస్సు కూచిపూడి నృత్యంతో మొదలవుతుందన్నారు. ఎంజీఎం గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అవసరమైన ఎంట్రీ పాస్‌లు తీసుకోవాలని సృజన సూచించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

యలమంచిలి : వచ్చే నెల మార్చి 10 నుంచి 12 వరకు యలమంచిలిలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ మరియు క్యాడేట్ తైక్వాండో పోటీలకు ఆదివారం జిల్లా జట్టు ఎంపిక జరిగిందని టైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో సబ్ జూనియర్ బాలికల విభాగంలో 12 మంది, బాలుర విభాగంలో 10 మంది, క్యాడేట్ విభాగంలో 10 మంది బాలికలు, 10 మంది బాలురు ఎంపికయ్యారని తెలిపారు. అండర్ 14 విభాగంలో తలపడే ఈ పోటీల్లో జిల్లాలో యలమంచిలి, అడ్డురోడ్డు, గాజువాక, విశాఖపట్నం, మధురవాడ, నడుపూరు టైక్వాండో క్లబ్‌ల నుంచి 110 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కార్యదర్శి ములంపాక అచ్చంనాయుడు, సీనియర్ నేషనల్ రిఫరీ కల్లేపల్లి శంకర్, న్యూ ఆంధ్ర ప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్యుతరెడ్డి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అరెపు గుప్తా, మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, సీనియర్ అంతర్జాతీయ క్రీడాకారుడు దొరబాబు పాల్గొన్నారు.

మరో అంతర్జాతీయ విమానం

- త్వరలో శ్రీలంక నుంచి విశాఖకు సర్వీసు
- పాలనా రాజధాని కానున్న తరుణంలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఆసక్తి
- ఇప్పటికే వైజాగ్–సింగపూర్‌ల మధ్య అంతర్జాతీయ విమాన సర్వీసు



శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో ఇంటర్నేషనల్ విమాన సర్వీసు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు ఒక అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విశాఖకు విమాన సర్వీసును నడపనుంది. ఆరేళ్ల క్రితం అంటే 2017లో ఇదే ఎయిర్‌లైన్స్ కొలంబో– విశాఖపట్నంల మధ్య ఒక సర్వీసును ప్రారంభించింది. అప్పట్లో ఆశించినంతగా ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ ఏడాదిన్నర తర్వాత ఈ సర్వీసును రద్దు చేసుకుంది. దీంతో అప్పట్నుంచి శ్రీలంకకు విమాన సర్వీసులు లేకుండా పోయాయి.

ఆ తర్వాత కోవిడ్ ప్రభావం చూపింది. ఇన్నాళ్లూ ఎవరైనా ఈ ప్రాంతం నుంచి విమానంలో శ్రీలంక వెళ్లాలంటే హైదరాబాద్, చెన్నైలకు చేరుకుని అక్కడ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రయాణికులకు ఆర్థికంగా పెనుభారం అవుతోంది. ప్రయాణ సమయం కూడా ఎక్కువ తీసుకుంటోంది. విశాఖ–కొలంబోల మధ్య వాయుమార్గంలో 1,249 కిలోమీటర్ల దూరం ఉంది. డైరెక్ట్ ఫ్లైట్‌లో వెళ్లడానికి 2.30 గంటల సమయం పడుతుంది. అదే హైదరాబాద్, చెన్నైలు వెళ్లి, అక్కడ నుంచి శ్రీలంక/కొలంబో వెళ్లాలంటే 10–16 గంటలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన రాజధాని ఏర్పాటవుతుండడంతో శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ మళ్లీ వైజాగ్‌పై దృష్టి సారించింది. విశాఖపట్నం–శ్రీలంకల మధ్య రాకపోకలు సాగించే వారి సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తోంది. శ్రీలంకలో బౌద్ధక్షేత్రాలు, హిందూ పురాణ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలున్నాయి. వాటిని సందర్శించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు. కోవిడ్ కూడా పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టిన తరుణంలో పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖ నుంచి శ్రీలంకకు టూరిస్టుల సంఖ్య పెరుగుతుందని శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ భావిస్తోంది. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని త్వరలోనే కొలంబో–వైజాగ్‌ల మధ్య విమాన సర్వీసును నడపాలని నిర్ణయించినట్టు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)మేనేజర్ చింతక పెరేరా తాజాగా వెల్లడించారు.

పెరుగుతున్న విమాన సర్వీసులు

మరోవైపు విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇటీవల కాలంలో విమాన సర్వీసులు క్రమంగా పెరుగుతున్నాయి. విశాఖ నుంచి హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పోర్టుబ్లెయిర్‌లకు ఈనెల 13 నుంచి, 21 నుంచి కొత్త సర్వీసులు మొదలయ్యాయి. ఇంకా మార్చి 3వ తేదీ నుంచి హైదరాబాద్, బెంగళూరులకు కూడా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో అందుకనుగుణంగా ఆయా విమానయాన సంస్థలు తమ సర్వీసులను విస్తృతం చేస్తున్నాయి.

పండినా...అగచాట్లే!



సత్యవరం గ్రామానికి చెందిన తమ్మిర్సి గంగారావు గతంలో ఐదెకరాల్లో తమలపాకు తోటలు వేసేవారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తమలపాకు బుట్టలు రవాణా చేసేవారు. అయితే రవాణా ఖర్చులు పెరిగిపోవడం, రైల్లో రవాణా చేసే వీలు లేకపోవడంతో తోటల సాగు తగ్గించుకున్నారు. ప్రస్తుతం రెండెకరాలకే పరిమితం అయ్యారు. తోటలకు తెగుళ్ళు సోకి నత్తగుల్ల పురుగు సోకి ఎర్రగా పండిపోయి రాలిపోతున్నాయని, దీంతో దిగుబడి తగ్గి నష్టం వస్తోందని చెబుతున్నారు. తమలపాకుల ఎగుమతికి రైలు ద్వారా రవాణా సౌకర్యం కల్పించాలని, తోటలకు బీమా, రాయితీలు కల్పిస్తేనే సాగు పెరిగి రైతులకు జీవనాధారంగా మారుతుందని చెబుతున్నారు.



ఏపుగా పెరిగిన తమలపాకు తోట

- ఆశ, నిరాశల మధ్య తమలపాకు రైతులు
- తెగుళ్ల బెడద, రవాణా నదుపాయాల కొరత
- నానాటికీ తగ్గుతున్న సాగు
- ప్రభుత్వ సహకారం కోరుతున్న రైతులు



బుట్టలు కట్టి రవాణాకు సిద్ధం చేస్తున్న తమలపాకు పందాలు

పాయకరావుపేట : మండలంలో గల తమలపాకు రైతులు ఆశ, నిరాశల మధ్య జీవనం సాగిస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో రైతులు తమలపాకు తోటలు పెంచుతున్నారు. మంగవరం, సత్యవరం, గోపాలపట్నం, మాసాహేబుపేట, పెదరాంభద్రపురం, చినరాంభద్రపురం, అరట్లకోట, శ్రీరాంపురం గ్రామాలకు చెందిన 2000 కుటుంబాలు తమలపాకు తోటలపై జీవనం సాగిస్తున్నారు. అలాగే ఎస్.రాయవరం మండలంలో కూడా 150 ఎకరాల్లో తమలపాకు తోటలు సాగవుతూ 500 కుటుంబాలకు జీవనాధారంగా ఉన్నాయి. ప్రస్తుతం తమలపాకు ధర కొంతవరకు గిట్టుబాటుగా వున్నప్పటికీ తోటలకి తెగుళ్ల పట్టి చనిపోవడంతో దిగుబడి తగ్గి రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

ఎకరాకు రూ.2 లక్షల ఖర్చు

రైతులు ఎకరం తమలపాకు తోట వేయాలంటే రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుంది. రెండేళ్ల పాటు తమలపాకు తోట ఏపుగా వుంటుంది.150 ఆకులతో కూడిన పందా ప్రస్తుతం 40 రూపాయలు ధర పలుకుతుంది. ప్రతి బుట్టకు 20 పందాలు చొప్పున కట్టలు కట్టి ఎగుమతి చేస్తుంటారు. ప్రతిరోజు తమలపాకుల్ని కోసి, ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ నుంచి అకోలా, పర్జిణీ రకాలు నాగ్‌పూర్, అమరావతి, హైదరాబాద్, బరంపురం, వరంగల్, కరీంనగర్, లక్నో, ఒరిస్సా తదితర ప్రదేశాలకు ఎగుమతి చేస్తారు. ఐదేళ్ల క్రితం ఐదు లేదా ఆరు లారీల సరకు నిత్యం ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా తోటలు నాశనం కావడం వల్ల, రైతులకు ప్రభుత్వం ఏవిధమైన పరిహారం ఇవ్వకపోవడం కారణంగా రవాణా గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం మండలం నుంచి రైలు, బస్సులు, వ్యాన్‌ల ద్వారా ఆయా ప్రాంతాలకు 500 బుట్టలు వరకు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. ఫిబ్రవరి నుంచి మే నెల వరకే తమలపాకులకు కొంతవరకు ధర వుంటుంది. మిగిలిన 8 నెలల పాటు ధర గణనీయంగా పడిపోయి, పందా 15 నుంచి 20 రూపాయలు మాత్రమే ధర లభిస్తోంది. దీంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమలపాకు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రవాణా సదుపాయం కల్పించాలి

ఇక్కడ నుంచి తమలపాకులు ఎగుమతి చేయడానికి సరియైన రవాణా సౌకర్యం లేదు. గతంలో లింక్ ఎక్స్‌ప్రెస్ ఉండేది. ఢిల్లీకి కూడా ఇక్కడి నుంచి తమలపాకుల బుట్టలు రవాణా చేసేవారు. అది కేన్సిల్ అయింది. ప్రస్తుతం గోదావరికి కూడా రవాణా చేయనీయడం లేదు. ఏపీ ఎక్స్‌ప్రెస్‌కి తుని హాల్ట్ ఇచ్చి, తమలపాకుల రవాణాకి అనుమతి వుంటే బాగుంటుందని పలువురు రైతులు కోరుతున్నారు. ట్రైన్ ద్వారా రవాణా చేసే తమలపాకు బుట్టకి హైదరాబాద్‌కు 40 రూపాయలు ఖర్చయ్యేది. ఇప్పుడు బస్సులో లేదా వ్యాన్ ద్వారా రవాణా చేస్తే 70 రూపాయలు ఖర్చవుతుంది.

ప్రభుత్వ సహకారం అవసరం



మండలంలో 8 గ్రామాల ప్రజలు తమలపాకు తోటలనే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారు. తోటలు తెగుళ్ళు వచ్చి చనిపోతున్నాయి. గతంలో కంటే తోటలు దిగుబడి బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం సహకారం అందించాలి.

– గూటూరు వెంకటేశ్వరరావు, రైతు, సత్యవరం

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

అనకాపల్లి రూరల్ : జనరల్ కోర్సుల ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అనకాపల్లి పట్టణం, గ్రామీణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా, కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు జరిగాయి. స్థానిక ఏఎంఏఎల్ కళాశాల, శ్రీ చైతన్య, నారాయణ, సాయికుల్వంత్, ఆదినారాయణ మహిళా, హిమశేఖర్ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం విశాఖ ఆర్ఐవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతి సెషన్‌లో పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి, మార్కులను ఓఎమ్ఆర్ పత్రాల్లో వేస్తున్నారు. ఆదివారం పట్టణంలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆయా పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌పై 23 కేసులు

- జిల్లావ్యాప్తంగా 450 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం
- ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్: జిల్లావ్యాప్తంగా 450 లీటర్ల బెల్లంపులుపు ధ్వంసం చేసినట్టు జిల్లా ఎస్పీ గౌతమిసాలి పేర్కొన్నారు. ఈమేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీస్ సులతో పాటు సెబ్ అధికారులు శనివారం నిర్వహించిన దాడుల్లో ఆరు కేసులు నమోదు చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. 450 లీటర్ల బెల్లంపులుపు ధ్వంసం చేయగా 13 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

కోడి పందేల శిబిరాలపై దాడి

ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు



పోలీసుల దాడిలో పట్టుబడిన పందెంరాయుళ్లు, కోళ్లు


యలమంచిలి: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేల శిబిరాలుపై ఆదివారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రూరల్ ఎస్సై కె. సన్నిబాబు వివరాల ప్రకారం.. షేకిళ్లపాలెం గ్రామ శివారులో కోడిపందేలు, గుళ్లాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.9 వేలు, గుళ్లాట ఆడే పట్టా, పిక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. గ్రామ తీర్థాల్లో గుళ్లాటలు, కోడి పందేలాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

జిల్లా జట్టుకు జాగృతి

విశాఖ స్పోర్ట్స్: జిల్లా అండర్ 19 చదరంగం జట్టు ఎంపిక పోటీల్లో జాగృతి ఆడిన మూడు రౌండ్లలో విజయం సాధించింది. అండర్–11 బాలురలో జయమోహన్, అర్జున్ ఐదేసి పాయింట్లు, బాలికల్లో శ్రీవిద్యా, ముస్కాన్ మూడున్నరేసి పాయింట్లు సాధించారు. అండర్–18 బాలురలో ఆర్యన్, శ్రీవైభవ్ మూడున్నరేసి పాయింట్లు, బాలికల్లో జాగృతి మూడు పాయింట్లతో, లక్ష్మిప్రియ రెండు పాయింట్లతో నిలిచారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వీరంతా జిల్లా అండర్–11, 19 జట్లుగా స్టేట్ అంతర జిల్లాల టోర్నీలో పాల్గొనున్నారు.

వినూత్నం.. విభిన్నం

- విద్యార్థులకు మేలు చేసేలా 'సెల్ఫ్'
- తీర్చిదిద్దిన నంగినారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా సిద్ధం చేసిన సెల్ఫ్ ఆన్‌లైన్ సాధనం

సబ్బవరం: విద్యార్థులను స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సబ్బవరం మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సెల్ఫ్ అనే వినూత్న ప్రొగ్రాంను ఆవిష్కరించారు. ఈ ప్రొగ్రాం ద్వారా విద్యార్థులు తమకు అర్థం కాని అంశాలతో పాటు సందేహాలను ఆన్‌లైన్‌లోనే నివృత్తి చేసుకునేవిధంగా ప్రొగ్రాం రూపొందించారు.



ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి(ఫైల్)

ఎక్కడైనా.. ఎప్పుడైనా..

ఇది ఆన్‌లైన్ సాధనం కావడంతో స్మార్ట్ ఫోన్‌లో విద్యార్థులు ఎక్కడైనా,ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు సరళమైన పద్ధతిలో అన్ని సబ్జెక్టులు అర్థం చేసుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకునే విధంగా దీన్ని సిద్ధం చేశారు. విద్యార్థులు తమ అభ్యసనలో భాగంగా వరుసగా అడిగే ప్రశ్నలకు ముందుగా జవాబులు చెప్పిన తర్వాతే ఇతర ప్రశ్నలు వచ్చే విధంగా రూపొందించారు. ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే దానికి సంబంధించిన సమాధానం వివరించే వీడియో వచ్చేలా ప్రొగ్రాం డిజైన్ చేశారు. వరుసగా అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతే ముందుకు వెళ్లడం జరుగుతుంది. దీంతో విద్యార్థులు క్లిష్టమైన అంశాలను నేర్చుకోవడంతో పాటు మరింత విస్తృతంగా సంబంధిత అంశాలను తెలుసుకోవచ్చు.

సాఫ్ట్‌వేర్ లేకుండానే ..

ఈ టూల్‌ను వినియోగించుకోవడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకునే విధంగా రూపొందించారు. ఈ సెల్ఫ్ ప్రొగ్రాంలో భాగంగా సబ్జెక్టుల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాన్ని పాఠశాల, మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించేందుకు అవసరమైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారు.

ప్రయోజనం ఇలా

విద్యార్థి సబ్జెక్టును అర్థం చేసుకోవడంలో సమస్య ఉంటే వీడియోను పదేపదే వీక్షించవచ్చు. అతను ఎప్పుడైనా,ఎక్కడైనా అంశాలను చూసుకోవచ్చు. ఇది స్వీయ మూల్యాంకనం, స్వీయ అభ్యసన సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ వీడియోలు గూగుల్ ఫామ్‌లో పొందుపర్చడంతో విద్యార్థులు కంటెంట్ వీడియో నుంచి పక్కకు మరళలేరు. ఈ టూల్‌ను క్లిక్‌బుల్ పీడీఎఫ్ ద్వారా వినియోగించుకోవచ్చు. గూగుల్ ఫారంలో 10 ప్రశ్నలు ఎంసీక్యూ రూపంలో ఇచ్చారు. తద్వారా విద్యార్థులు సరైన సమాధానం ఎంచుకుంటే తదుపరి ప్రశ్నకు వెళ్తుంది. విద్యార్థి తప్పు సమాధానం ఎంచుకుంటే అది వివరణ వీడియోకి తీసుకువెళ్తుంది. పూర్తి వీడియో చూసిన తర్వాత విద్యార్థి సరైన సమాధానం ఎంచుకోవడానికి అదే ప్రశ్నకు మళ్లించబడతారు. దీంతో విద్యార్థులు క్లిష్టమైన భావనలను నేర్చుకోగలుగుతారు.

ప్రొగ్రాం లక్ష్యం

- స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు విద్యార్థులను ప్రోత్సహించడం
- విద్యార్థులకు క్లిష్టమైన అంశాల్లో సందేహాలను నివృత్తి చేయడం.
- తక్షణ సందేహ నివృత్తి కలిగించడం
- విద్యార్థుల నిరంతర మూల్యాంకనం
- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం



	School	Record Count
1.	ZPHS S. RAYAVARAM	139
2.	ZPHS ROLUGUNTA	116
3.	ZPHS G. KODURU	109
4.	ZPHS GOPALLI WEST	103
5.	PBM Z.P.High School VEMU...	103
6.	ZPHS G KASIMKOTA	101
7.	ZPHS K KOPPAKA	96
8.	ZPHS THUMMAPALA	93
9.	MPL TOWN GIRLS HS	92
10.	ZPHS JALLURU	82
11.	KGBV ROLUGUNTA	76
12.	ZPHS T. ARJAPURAM	74
13.	ZPHS NANGINARAPADU	73
14.	ZPHS, pedaboddepalli	68
15.	KGBV KOTAURATLA	66
16.	ZPHS ATCHUTHAPURAM	60
17.	ZPHS DONDAPUDI	59
18.	ZPHSB MADUGULA	59
19.	ZPGHS VEMULAPUDI	58
20.	ZPHSCHOOL LAKSHMIPUR...	58
21.	ZPHS VRR PETA	56
22.	ZPHS MAKAVARAPALEM	55
23.	ZPHS KUNDRAM	55
24.	ZPHS KORUPROLU	54
25.	ZPHS GANAPARTHI	53
26.	Ap ModelSchool, vemulapudi	52
27.	Z P G H School Narsipatnam	51

డ్యాష్ బోర్డులో పాఠశాలల వారీగా వివరాలు చూపిస్తున్న సెల్ఫ్ ఆన్‌లైన్ ప్రొగ్రాం

పర్యవేక్షణకు డ్యాష్‌బోర్డు

పాఠశాల,మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించడాని అవసరమైన డ్యాష్ బోర్డు రూపొందించాం. ఈ డ్యాష్ బోర్డులో జిల్లాలోని అన్ని మండలాల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పేర్లు ఉంటాయి. ఆయా పాఠశాలలను క్లిక్ చేయడం ద్వారా పూర్తి చేసిన విద్యార్థుల పేర్లు ప్రదర్శించబడతాయి.
–పోకూరి శ్రీనివాసరావు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు,నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సబ్బవరం మండలం

సాధారణ ఆన్‌లైన్ సాధనం

సెల్ఫ్(సెల్ఫ్ ఎవల్యూషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్) ఇది విద్యార్థుల కోసం సాధారణ ఆన్‌లైన్ సాధనం. వారు దీన్ని ఎప్పుడైనా,ఎక్కడైనా స్మార్ట్ ఫోన్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఇది ప్రతి అధ్యాయానికి సంబంధించిన బహుళ ఎంపిక ప్రశ్నలు అడుగుతుంది. విద్యార్థులు తమ స్వీయ అభ్యాసం–మూల్యాంకనం కోసం గూగుల్ ఫారం ఆధారిత ఆన్‌లైన్ మూల్యాంకనాలను సబ్జెక్టుల వారీగా సిద్ధం చేశాం.
–నంది సోమేశ్వరరావు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,సబ్బవరం మండలం

సినీ దర్శకుడు నక్కిన త్రినాథ్‌కు సత్కారం



తెలుగు చలనచిత్ర దర్శకుడు నక్కిన త్రినాథరావును సత్కరిస్తున్న ప్రసన్నకుమార్, సురేంద్ర

తుమ్మపాల : పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాథరావును చలనచిత్ర నటులు ప్రసన్నకుమార్, టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవితేజ హీరోగా ధమాకా చిత్రం సూపర్ హిట్ అయ్యి ప్రేక్షకులను ఆకట్టుకుందని, త్వరలో మరోమంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాలని కోరారు. శ్రీనూకాంబికా అమ్మవారి ఆశీస్సులతో మరెన్నో చిత్రాలు పెద్ద హీరోలతో చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లపు శ్రీనివాసరావు, నక్కిన సురేష్, భానుచంద్ర, జొన్నాడ సురేష్ పాల్గొన్నారు.

హీరో శ్రీకాంత్ సందడి



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న హీరో శ్రీకాంత్

ఎస్.రాయవరం : ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ అడ్డురోడ్డు సమీపంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి విచ్చేసి సందడి చేశారు. ఆయనను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఆయినతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ప్రేక్షకులను ఉత్సాహ పరుస్తూ శ్రీకాంత్ ప్రసంగించారు. భూమిని నమ్ముకున్న ఏ ఒక్కరూ మోసపోరని, భూమిని పవిత్రంగా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఉప్పలపాటి సుకుమార్‌వర్మ,స్థానికులు పాల్గొన్నారు.

వాస్తవాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఈనాడు తప్పుడు కథనాలపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట : ఈనాడులో వస్తున్న తప్పుడు రాతలు, కథనాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను తెలియేయండని మండల వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం కొవ్వూరు గ్రామంలో మండల కమిటీ నాయకులతో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఇంటి వద్ద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిపై పోలీసులు దాడి చేసినట్టు తప్పుడు రాతలు రాయడం, ఎప్పటిదో పాత ఫొటో ప్రచురించి ప్రజలను నమ్మించి విద్వేషాలు పెంచడం మంచి విధానం కాదన్నారు. దీనివల్ల ఎవరికైనా మంచికి బదులు చెడే జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. అలాగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి అంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇక్కడ వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, రోలుగుంట మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు ఉలబాల రాము, గ్రామ ఉప సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సందడిగా వేగి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

విజయనగరం డీఎస్పీ వెంకటరావు దంపతులకు సత్కారం



మునగపాకలో వేగి కుటుంబ సభ్యుల కలయిక

మునగపాక : మునగపాక దరి వేగి పరదేశినాయుడు పొలాల వద్ద ఆదివారం వేగి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, బెంగుళూరు, ఏపీకి చెందిన వేగి కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పురుషులకు కూడా వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. వేగి వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను విజయనగరం డీఎస్పీ వేగి వెంకటరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరావు దంపతులను వేగి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. వర్ధమాన సినీ దర్శకుడు అవినాష్ దంపతులతో పాటు కరోనా సమయంలో మెరుగైన సేవలందించిన డాక్టర్ నళినిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు వేగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా జిల్లా స్థాయి చదరంగ పోటీలు



చదరంగం పోటీల్లో పాల్గొన్న క్రీడకారులు

నర్సీపట్నం : జిల్లా చదరంగం అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో జిల్లా స్థాయి చదరంగం అండర్–15 పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులతో పాటు తల్లిదండ్రులు ఈ పోటీలకు తరలిరావడంతో క్రీడాప్రాంగణం సందడిగా మారింది. ఈ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వూడా రాము, కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, కోశాధికారి బిశ్వాస్ ప్రారంభించారు. ఈ పోటీలను చదరంగం కోచ్ మల్లికార్జున పర్యవేక్షించారు. ఈ పోటీల్లో బాల,బాలికలు 30 మంది ఎంపికయ్యారు. నలంద స్కూల్ కరస్పాండెంట్ రాజేష్ పాల్గొన్నారు.


చెట్టును ఢీకొన్న ఆటో : నలుగురికి గాయాలు



సీతపల్లి సమీపంలో ఆటో ప్రమాదం

రంపచోడవరం: మండల కేంద్రం రంపచోడవరం –సీతపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ మధ్య ఆదివారం ప్రయాణికులతో ఉన్న ఆటో చెట్టును ఢీకొట్టడంతో నలుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గంగవరం మండలం ఓజుబంధంకు చెందిన రాజమ్మ, కె.మోహన్ సాయికల్యాణ్, సతీష్, లక్ష్మిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. వీరిలో రాజమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



బాబూరావు మృతదేహం

ఎస్.రాయవరం: మండలంలోని దార్లపూడిలో పినపాల బాబూరావు (43) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... కొద్దిరోజులుగా తీవ్రంగా మద్యం తాగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఆరు రోజుల క్రితం పొలంలో గడ్డి పెరగకుండా వాడే మందును తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే బాబూరావును నక్కపల్లి, ఆపై అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమంగా ఉండటంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

శిక్షణ పొందిన ప్రతి విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడాలి

సీతమ్మధార (విశాఖ ఉత్తర): స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన ప్రతీ విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడాలని ప్రభుత్వ సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) జాతీయ స్థాయి సొసైటీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబరైన గాది శ్రీధర్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించిన నేపథ్యంలో దొండపర్తిలోని ఓ హోటల్లో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీధర్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించడం హర్షణీయమన్నారు. శ్రీధర్ రెడ్డి మా ట్లాడుతూ శిక్షణ పొందిన వారంతా ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ సౌత్ ప్రొఫెసర్ ఎన్.సాంబ శివరావు, విశాఖ చాప్టర్ చైర్మన్ ఓ.ఆర్.ఎం.రావు, సెక్రటరీ హేమ యాదవల్లి, ఎన్.సి.మెంబర్స్ ఠాగూర్, అప్పారావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ దర్శకుడిగా ఎదగడమే ధ్యేయం

వర్ధమాన సినీ దర్శకుడు, గాయకుడు వేగి అవినాష్



కశింకోట : ఉత్తమ దర్శకునిగా ఎదగడమే తన ధ్యేయమని వర్ధమాన సినీ డైరెక్టర్, సినీ నేపథ్య గాయకుడు వేగి అవినాష్ అన్నారు. ఆదివారం ఇక్కడ సాక్షితో మాట్లాడుతూ జిల్లాలోని కోటవురట్ల మండలం రాజుపేటకు చెందిన తాను డిగ్రీ చదివి 15 ఏళ్ల క్రితం సినీ రంగంలోకి ప్రవేశించానన్నారు. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సుమారు 400 పైబడి పాటలు పాడానన్నారు. తమిళ్‌లో ఎక్కువ పాటలు పాడానన్నారు. అల్లు అర్జున్ నటించిన ' పరుగు' సినిమాలో 'నమ్మదేమోగాని'..పాటకు మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఉత్తమ నేపథ్య గాయకునిగా ఈ పాటకు ఫిల్మ్ ఫేర్ పురస్కారం కూడా లభించిందన్నారు. తనకు నేపథ్య గానం కంటే దర్శకత్వం అంటే మక్కువ ఎక్కువని, దీంతో తమిళంలో 'నాన్ మగన్ అలీ' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరి మెలకువలు పొందానని వెల్లడించారు. దీంతో తొలిసారిగా నూతన నటీనటులతో తీసిన 'మనవూరి పాండవులు' సినిమాకు దర్శకత్వం చేసే అవకాశం వచ్చిందన్నారు. తన దర్శకత్వంలో మరో సినిమా తీయడానికి కథా చర్చలు జరుగుతున్నాయని, వివరాలు త్వరలో వెల్లడిస్తానని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన(పీఎంకేవీవై–4.0) ద్వారా ఉద్యోగ కల్పనలో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత శిక్షణ–ఉపాధికి దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రిషన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫోర్ వీలర్ సర్వీస్, టెక్నీషియన్, ప్లంబర్ జనరల్, ఫీల్డ్–ఆర్ అండ్ ఏసీ వంటి మూడు నెలల కాల వ్యవధి కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం అవకాశాలు కల్పిస్తామన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పాసై, 18 నుంచి 45 ఏళ్ల గల యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9966861476, 9346258000 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

కశింకోట: రైలు నుంచి జారి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందడంతో అంత్యక్రియలు చేసినట్లు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి ప్రయాణిస్తూ తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు నుంచి ఈ నెల 17న నర్సింగబిల్లి – బయ్యవరం రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రైల్వే సిబ్బంది 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో అనకాపల్లి శ్మశాన వాటికలో మృతదేహాన్ని పూడ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని వద్ద గుర్తింపునకు ఆధారాలు లభ్యం కాలేదు. సిమెంట్ రంగు ఫుల్ చేతుల టీషర్టు, నలుపు రంగు రన్నింగ్ ట్రాక్ సూట్ దుస్తులు ధరించి ఉన్నాడు. మృతుడి సంబంధికులు తమ సెల్ నంబర్లు 9490619020, 9494887786ను సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



గొలగాంలో పూజలందుకుంటున్న గణపతి

తుమ్మపాల : అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ వాసవీ కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి వ్రతాలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఉత్సవ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంతిపూరి శ్రీనివాస్, కనకా మధుసూదనరావు, నూతన హరిశంకర్, ప్రదీప్, సునీల్, తులసీరావు, సంతోష్, శ్రీదత్తు, ప్రసాద్ పాల్గొన్నారు.

475 మందికి బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 475 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మంది చిన్నారులు కూడా ఉన్నారు. 322 మందికి కళ్లద్దాలు, 88 మందికి మందులు పంపిణీ చేశారు. బ్రాండెక్స్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన 101వ శిబిరం ఇది. 43 మందికి కేటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజన సదుపాయం కల్పించారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన రోగులను బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరామర్శించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రచారం

కశింకోట : మండలంలోని చింతలపాలెం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, మజ్జి నిరంజన్‌కుమార్, పాల సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి కన్నయ్య, గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
డెడ్‌లైన్	పర్తిసాయి
వీరసింహారెడ్డి	వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 70 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు , బీ పాజిటివ్-22 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఓ నెగిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 413 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 234 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పన్ను వసూళ్లలో పంచాయతీలు డీలా

- బకాయిలతో కలిపి డిమాండ్ రూ.2.29 కోట్లు
- ఇప్పటివరకు వసూలైంది రూ.76.15 లక్షలు
- సమీపిస్తున్న ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు



సత్యనారాయణపురంలో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

అనకాపల్లి రూరల్ : స్థానిక వనరుల సమీకరణ, పన్ను, పన్నేతర ఆదాయం, ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లకు సంబంధించిన నిధుల పరిపుష్టితోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుత పాలకవర్గాలు ఆ దిశగా అడుగు వేయకుండా, కేవలం ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లపైనే ఆధారపడుతుండటంతో అభివృద్ధి మందగించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గడువు ముంచుకొస్తోంది

గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడానికి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పాఠశాలలను, ఆస్పత్రులను అభివృద్ధి చేయడం మొదలు, సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు తోడుగా గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతర రాబడులపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తే పంచాయతీల ఖాతాల్లో నిధులు జమయ్యే అవకాశాలు పెరుగుతాయి. క్షేత్రస్థాయి సిబ్బంది, పాలకవర్గాలు పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం చూపుతుండటంతో తక్కువ మొత్తంలోనే వసూలవుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం మరో నెల రోజుల్లో ముగియనుండటంతో వసూళ్ల ప్రక్రియ మరింత వేగం పుంజుకోవాల్సి ఉంది.

పచ్చని పల్లెలయినా, సకల సౌకర్యాల పట్టణాలయినా అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా కావాల్సినవి నిధులే. వీటిని కొంత ప్రభుత్వం అందిస్తే, మిగిలినవి పన్నుల రూపేణా స్థానికుల నుంచి వసూలు చేస్తారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను, లైబ్రరీ సెస్ ఇలా వచ్చే ఆదాయమే ఆయా పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి ఊతమై నిలుస్తాయి. కానీ అనకాపల్లి మండలం వ్యాప్తంగా ఈ పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. వసూళ్ల కోసం ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినప్పటికీ, ఆశించిన స్థాయిలో పన్ను వసూళ్లు జరగట్లేదు.



కొత్తూరు పంచాయతీ కార్యాలయం

వసూలైంది 33 శాతమే : అనకాపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో తుమ్మపాల, కొత్తూరు మేజర్ పంచాయతీలు కాగా మిగిలినవి మైనర్ పంచాయతీలే. ఈ ఏడాదికి మండలంలో పాత బకాయిలతో కలిపి వసూలు కావాల్సిన పన్నుల డిమాండ్ రూ.2 కోట్ల 29 లక్షల 20 వేల 173 కాగా ఇప్పటివరకు వసూలు చేసింది రూ.76 లక్షల 15 వేల 102 మాత్రమే. ఇది మొత్తం డిమాండ్‌లో కేవలం 33 శాతం. ఇక పన్నేతర వసూళ్ల డిమాండ్ రూ.6 లక్షల 5 వేల 615 కాగా, రూ.3 లక్షల 48 వేల 441 మాత్రమే వసూలయింది.ఈ గణాంకాల ప్రకారం మండలంలో పన్ను, పన్నేతర వసూళ్లు ఎంత మందగమనంలో ఉన్నాయో తెలుసుకోవచ్చు.

సర్పంచుల పాత్ర కీలకం : గ్రామ పంచాయతీల పరిధిలో పన్నులు వసూలు చేయడం, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించే విషయంలో గ్రామ సర్పంచులది కీలకపాత్ర. ఆయా పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధి కోసం వెచ్చించుకునే సౌలభ్యం ఉంటుంది. అయినా చాలా వంది సర్పంచులు పన్ను వసూళ్లపై పెద్దగా దృష్టి సారించట్లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్లపై తప్ప.. స్థానిక వనరులను పట్టించుకోవట్లేదన్న విమర్శలు ఉన్నాయి. అనేక పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే నేటికీ లెక్కల్లో చూపుతున్నారు. మండలంలోని చాలా పంచాయతీలు 40 నుంచి 50 శాతం వరకు భౌగోళికంగా విస్తరించాయి. చాలా పంచాయతీల్లో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. వీటిపై సరిగా దృష్టి సారించకపోవడం వలన గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరులను కోల్పోతున్నాయని అధికారులు చెప్తున్నారు.

వేగవంతం చేశాం



ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేశాం. ఇప్పటి వరకు 33 శాతం వసూలయ్యాయి. రానున్న 10 రోజుల్లో 80 శాతం వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. గ్రామ పంచాయతీల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, బిల్ కలెక్టర్లు సంయుక్తంగా పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తే మంచి ఫలితం ఉంటుంది. పంచాయతీ కార్యదర్శులతో దీనిపై ఎప్పటికపుడు సమీక్షిస్తున్నాం.

– కె ధర్మారావు, ఎంపీడీవో, అనకాపల్లి

నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నేడు

తుమ్మపాల : పట్టణంలోని రింగురోడ్డు వద్దనున్న పెంటకోట కన్వెన్షన్ హాలులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయాల సమన్వయకర్తలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నిరంకారిబాబా భక్తుల స్వచ్ఛ సేవ



గవరపేటలో శారదానది మెట్ల ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్న నిరంకారి బాబా భక్తులు

కశింకోట : స్థానిక గవరపేటలో వెలసిన శారదా గణపతి రామాలయం, శారదానది ప్రాంతాన్ని ఆదివారం నిరంకారి బాబా భక్తులు శుభ్రపరిచారు. సంత్ నిరంకారి మిషన్ వారి అమృత్ ప్రాజెక్టులో భాగంగా స్వచ్ఛ జల్, స్వచ్ఛ మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, నదికి వెళ్లే మెట్ల మార్గాన్ని చెత్తా, చెదారం తొలగించి తుడిచి శుభ్రం చేశారు. నిరంకారి బాబా భక్తులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- ఉత్సాహంగా ఆనంద మేళా



ఆనంద మేళాను ప్రారంభించిన ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



విద్యార్థులకు సైకిళ్లు అందజేసిన సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహూతులకు స్వాగతం పలికారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో విద్యావంతులుంటే మేలు

తుమ్మపాల : ఉన్నత విద్యావంతులను చట్టసభలకు పంపితేనే యువత, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 81వ వార్డులో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ టీడీపీ పట్టభద్రుల అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రతి కార్యకర్త ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో 81వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూకాంబిక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



కొత్త అమావాస్య ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వేగి వెంకటఅప్పారావు

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మ వారి కొత్త అమావాస్య ఉత్సవాల గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. వేగి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగదేవిపేటలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ వేగి వెంకటఅప్పారావు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 19 నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ధర్మకర్త వేగిరామరాజు తెలిపారు.

అనకాపల్లి సుగర్స్ పరిరక్షణకు కృషి

- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

అనకాపల్లి రూరల్ : ఎంతోమంది రైతులు, కార్మిక కుటుంబాలకు జీవనాధారమైన అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీని లిక్విడేషన్ నుంచి ప్రభుత్వం కాపాడాలని అఖిల పక్ష రాజకీయ, ప్రజా రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు, సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం, సీపీఎం నేత బాలకృష్ణ, ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్రి అప్పారావు, జనసేన నాయకుడు శ్రీరామదాస్ గోవింద్ మాట్లాడారు. సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించుకోవడం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని తీర్మానించారు. ఈ ఫ్యాక్టరీని ఆధునికీకరించి, చెరకు క్రషింగ్ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో సీపీఐ నాయకులు దొరబాబు, కోన లక్ష్మణ్, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, చెరకు రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, దూలం గోపి, మళ్ల శ్రీను, బొడ్డేడ అప్పారావు, బట్ట చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి దర్శనం ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి మూలవిరాట్

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి గర్భగుడి దర్శనం ఆదివారం నుంచి భక్తులకు కల్పించినట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ చెప్పారు. ఈ నెల 22 నుంచి 25 వరకు కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌కు రంగులు వేశారు. దీంతో దర్శనాలను నిలిపేశారు. పనులు పూర్తి కావడంతో దర్శనాలకు అనుమతించారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈవో తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయురాలు జానకికి పూర్వ విద్యార్థుల సత్కారం



డీపీఎన్ స్కూల్1973-74 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట : ఒకప్పుడు వారంతా పదో తరగతి కలిసి చదువుకున్నారు. పది, పాతికేళ్లు కాదు.. ఏకంగా అర్ధ శతాబ్దం తర్వాత కలిశారు. ఏ ఒక్కరు కూడా గతాన్ని నెమరువేసుకుని, పలకరిద్దామన్నా.. రూపురేఖలు గుర్తుపట్టలేని విధంగా వయసు దాటేసింది. ఈ వయసులో అప్పటి ఆనవాళ్లు కూడా మరుగునపడ్డాయి. చాలా మందికి మనవలు, మనవరాళ్లు కూడా ఇపుడు పదోతరతి దాటేశారు. అలాంటి వారంతా ఒక్కొక్కరుగా పరస్పరం కొత్తగా పరిచయం చేసుకుని మరీ.. తమ చిన్ననాటి స్మృతుల్ని నెమరువేసుకున్నారు. తామంతా షష్టిపూర్తి వయసు అధిగమించేశామన్న విషయం కూడా వారికి గుర్తురానంతగా కేరింతలు కొట్టారు. అప్పట్లో చేసిన చిలిపి పనుల్ని గుర్తున్న మేరకు.. గుర్తు చేసుకుని మరీ.. ఒకర్ని ఒకరు ఆటపట్టించుకున్నారు. అలాంటి అపురూప సంబరాలకు స్థానిక డీపీఎన్ జిల్లాపరిషత్ హైస్కూల్ వేదికయింది. ఈ స్కూల్లో 1973-74 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగపూర్ తదితర సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారితో సహా స్థానిక పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఒరేయ్ మీ పిల్లలు ఎలా ఉన్నారు.. ఏం చేస్తున్నారంటూ.. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. అంతా కలిసి ఫోటోలు దిగారు. తమకు చదువు చెప్పిన సైన్స్ ఉపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయుడు కాశీనాయుడులను సత్కరించారు. తమ సహ విద్యార్థి రఘుమణి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని, ప్రతి నెలా కొంత సాయం అందించి, అండగా నిలవాలని నిర్ణయించారు. తమతో చదువుకున్న పూర్వ మహిళా విద్యార్థులకు పసుపు, కుంకుమలతో చీరలు బహూకరించి గౌరవించారు. పూర్వ విద్యార్థులు డి. ధర్మరాజు, ఉజ్జి సూర్యమల్లేశ్వరరావు తదితరులు ఈ సమ్మేళన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లిరూరల్ : చోడవరం మండలం అడ్డూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.సతీష్ శ్రీనివాస్‌పై అడ్డూరు వైస్సార్‌సీపీ నాయకులు దాడి చేశారంటూ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. సచివాలయ ఉద్యోగిపై దాడికి ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌పై దాడి చేయడం దారుణమన్నారు. నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తున్న సచివాలయ సిబ్బందికి, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

సీఐఐ చైర్మన్‌గా లాల్‌కృష్ణ నియామకంపై హర్షం



పరవాడ: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్ చైర్మన్‌గా జేఎస్ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ నియామకం కావడంతో జేఎస్ ఫార్మా పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీర్మానించారు. రాంకీ ఎండీగా వ్యవహరిస్తూ దేశ విదేశాల నుంచి ఫార్మా కంపెనీలను జేఎస్ ఫార్మాసిటీలోకి తీసుకురావడంతో పాటు ఫార్మా రంగంలో ఆయనకున్న అపార అనుభవమే సీఐఐ చైర్మన్ పదవి అధిష్టించడానికి కారణమని పలువురు పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ లాల్‌కృష్ణను రాంకీ కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐఐ చైర్మన్ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పదవికి సముచిత న్యాయం చేస్తానని డాక్టర్ లాల్‌కృష్ణ అన్నారు.

వైద్యసేవలు సద్వినియోగపరచుకోండి

ఎస్.రాయవరం: ప్రముఖ వైద్యులు అందుబాటులోనికి వచ్చినప్పుడు వైద్య సేవలు సద్వినియోగపరచుకోవాలని బీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బంగారయ్య అన్నారు. అడ్డురోడ్డులో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల నుంచి 746 మంది రోగులు హాజరయ్యారు. విశాఖపట్నం నుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని ప్రత్యేకంగా గుర్తించారు. కార్యక్రమానికి కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, స్థానిక సర్పంచ్ కర్రి సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జోరుగా ఈ కేవైసీ నమోదు

- సబ్ డివిజన్‌లో 97.3 శాతం పూర్తి
- ఈ కేవైసీ తుది గడువు ఈ నెల 28



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి రూరల్ : ఈ ఏడాది రబీలో పంటలకు సంబంధించి ఈ కేవైసీ నమోదు ప్రక్రియ జోరుగా జరుగుతోంది. అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇప్పటివరకు 97.3 శాతం పంటలకు ఈ కేవైసీ పూర్తి చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాలున్నాయి. మొత్తం 4778 మంది రైతులు, 4028 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేశారు. అనకాపల్లి మండలంలో 96 శాతం, మునగపాకలో 98 శాతం, కశింకోటలో 98 శాతం ఈ కేవైసీ పూర్తి చేశారు. ఈ క్రాప్ మాత్రం 100 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తొలుత ప్రభుత్వం ఈ కేవైసీ నమోదుకు ఈ నెల 25 వరకు గడువు ఇవ్వగా మిగిలిన రైతులు నష్టపోకుండా 28 వరకూ గడువును పొడిగించింది. ఈ కేవైసీ నమోదు చేసుకోని రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రయోజనాలు కోల్పోతారని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. అందుకే ఈ కేవైసీ నమోదు అధికార యంత్రాంగంతో పాటుగా రైతులు కూడా తమ సమష్టి బాధ్యతగా తీసుకోవాలని అనకాపల్లి మండల వ్యవసాయాధికారి పీయూబీపీ రంగాచారి కోరుతున్నారు. కేవలం కొద్దిమంది రైతులకు సంబంధించి మాత్రమే ఈ కేవైసీ నమోదు పూర్తి కాలేదు. మృతి చెందిన రైతులు, వేలి ముద్రలు నమోదు కాని రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వారి కుటుంబ సభ్యుల్లో ఒకరి ఆధార్ కార్డు ఆధారంగా ఈ కేవైసీ నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ కేవైసీ గడువు దగ్గర పడుతుండడంతో రైతుల కోసం సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంటున్నారు. ఆధార్‌తో మొబైల్ నంబరు లింక్ అయిన రైతులు తాము ఎక్కడ ఉన్నా ఓటీపీ ద్వారా ఈ కేవైసీ నమోదు చెసుకునే అవకాశం ఉంది.

ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు తనకు వేసి గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమా ప్రభ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఉద్యోగుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక, రైతు, ఉద్యోగ ప్రజా సమస్యలపై పనిచేస్తూ నిరంతరం ప్రజల గొంతుకై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. ఈ సమావేశంలో సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ రామకృష్ణ, మళ్ల స్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ